12 గ్రీన్ టెక్ స్టార్టప్‌ల ఎంపిక

రాయదుర్గం: గ్రీన్ ఎనర్జీ, స్మార్ట్ సిటీస్, క్లైమేట్ టెక్, సస్టేనబుల్ అగ్రికల్చర్, మొబిలిటీ వంటి రంగాలలోని 12 గ్రీన్ టెక్ స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడానికి ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ఏఐసీ దాని 3వ ఆకాష్ ఈపీఏఎం సోషల్ ఇంపాక్ట్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్‌ను ఎంపిక చేశారు. ఏఐ/ఎంఎల్, రోబోటిక్స్, జీఐఎస్ వంటి సాంకేతికతను ఉపయోగించి మాన్యువల్ స్కావెంజింగ్, సోలార్ ఎఫిషియన్సీ, స్మార్ట్ ఇరిగేషన్, భూమి పునరుద్ధరణ వంటి సవాళ్ళను స్టార్టప్‌లు ఎదుర్కొంటున్నాయి.

ముత్తంగి పాఠశాల ఆకస్మిక తనిఖీ



ఏఐ బోధనను పరిశీలిస్తున్న జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలలో కృత్రిమ మేధ (ఏఐ) బోధనపై విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగి ప్రభుత్వ పాఠశాలను డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీచర్ల బోధన తీరును పరిశీలించారు. అనంతరం ఏఐ బోధన ద్వారా పాటలు వింటున్న విద్యార్థులను చూశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ. తరగతి గదులు శిథిలదశలో ఉంటే విద్యార్థులను అందులో కూర్చోబెట్టవద్దని సూచించారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం నిర్వహించిన డ్రైవ్‌లో ఏడుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఆరుగురికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి, ఒకరికి రూ.1500 జరిమానా విధించినట్లు తెలిపారు.

హైటెక్స్‌లో ఇండస్ట్రియల్ టెక్నాలజీ ఎక్స్‌పో ప్రారంభం



మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఇండస్ట్రియల్ టెక్నాలజీ ఎక్స్‌పో- 2025ను తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఎక్స్‌పోల ద్వారా పరిశ్రమల భవిష్యత్తు, పారిశ్రామిక రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికతపై అవగాహన కలుగుతుందని నిర్మలా జగ్గారెడ్డి తెలిపారు. పారిశ్రామిక ఉత్పత్తుల తయారీదారులు, ఉత్పత్తుల సరఫరాదారులను , పారిశ్రామిక నిపుణులను, నూతన ఆవిష్కరణలను అందించే వారిని ఒకే చోటుకి చేర్చడమే లక్ష్యమన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పారిశ్రామిక నగరాల నుంచి 100కి పైగా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రదర్శనలో చేతి పనిముట్లు మెషిన్‌టూల్స్, రోబోటిక్స్, ఇండస్ట్రీయల్ ఆటోమెషిన్, సోలార్ పవర్‌ప్లాంట్లు, ఎలక్ట్రికల్స్, ఎలక్ట్రానిక్స్, సురక్షిత ఉత్పత్తులకు సంబంధించిన పలు రకాల ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమంలో జీడిమెట్ల ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయ కిషోర్ కోనేరు, అసోసియేషన్ల సభ్యులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ఎమ్మెల్యే గాంధీ

కూకట్‌పల్లి: ఆయా డివిజన్‌లలో వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కూకట్‌పల్లి డివిజన్‌లోని రామారావునగర్, దీనబంధు కాలనీ, ఆస్‌బెస్టాస్ కాలనీలో సుమారు కోటి రూపాయల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమమే ధ్యేయమన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నరేష్, ప్రభాకర్, మహేష్, రఫిక్, దీపక్, రాజు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు పనులకు శంకుస్థాపన

అల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ సత్యనారాయణ

వివేకానందనగర్ కాలనీ స్వామి వివేకానంద విగ్రహం నుంచి సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ వరకు సర్వీస్ రోడ్డులో 70 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు, దొడ్ల వెంకటేష్‌గౌడ్‌లతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన చేశారు. ట్రాఫిక్ సమస్యను తగ్గించడానికి సర్వీస్ రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

ఘనంగా కొండ విజయ్‌కుమార్ జన్మదిన వేడుకలు



చందానగర్ : హోప్ ఫౌండేషన్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర హాకీ అధ్యక్షులు కొండ విజయ్‌కుమార్ జన్మదిన వేడుకలు శుక్రవారం చందానగర్ గంగారంలోని హోప్ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, 10వ తరగతి విద్యార్థిని రిషితకు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయ్ కుమార్ సేవలను అభినందిస్తున్నానన్నారు. సుమారు 110 మంది రక్తదానం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్, కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, లయన్స్ క్లబ్, హోప్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు

మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో నిర్వహించిన అంతర్జాతీయ ఇంజనీరింగ్ సదస్సు శుక్రవారం ముగిసింది. కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ భారత్‌ను ఇన్నోవేషన్ అధారిత ఆర్థిక వ్యవస్థగా మలచడంలో ఇంజనీరింగ్ పరిశోధన అకాడమియా ఇండస్ట్రీ తోడ్పడుతుందన్నారు. భారతీయ ఇంజనీర్లు ప్రపంచస్థాయి నిపుణులతో ఆలోచనలు పంచుకోవడానికి వేదిక ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్, స్కైరూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకుడు పవన్‌కుమార్ చందన, ఎఎస్ఎంఈ ఇండియా డైరెక్టర్ మధుకర్‌శర్మ, ఎఎస్ఎంఈ అధ్యక్షుడు డాక్టర్ లెస్టర్ సూ తదితరులు పాల్గొన్నారు.

విన్‌ఫాస్ట్ ఇండియా ఎలక్ట్రిక్ షోరూమ్ ప్రారంభం

రాయదుర్గం: విన్‌ఫాస్ట్ ఇండియా సంస్థ తమ మొదటి ఎలక్ట్రిక్ షోరూమ్‌ను నానేష్ ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామ్యంతో నగరంలోని గచ్చిబౌలి-రాయదుర్గం రోడ్డులో ప్రారంభించారు. విన్‌ఫాస్ట్ ఇండియా డిప్యూటీ సీఈఓ అరుణోదయ్‌దాస్ విలేకరులతో మాట్లాడుతూ ప్రీమియం ఎలక్ట్రిక్ ఎస్‌యూవీలు, వీఎఫ్-6, వీఎఫ్-7ను పరిచయం చేశామన్నారు. వీఎఫ్-6 ఎక్స్ షోరూమ్ ధర రూ.16.49 లక్షల నుంచి.. వీఎఫ్-7 ఎక్స్ షోరూమ్ ధర 20.89 లక్షల నుంచి ప్రారంభమవుతున్నాయన్నారు.

నివాళి

చందానగర్ : అఖిల భారత మాజీ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం చందానగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ(ఎం) నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐఎం నాయకులు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఉద్యమాలు చేస్తూ జీవితాంతం ప్రజలకు సేవ చేశారన్నారు. ఏచూరి స్ఫూర్తితో మరిన్ని ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) శేరిలింగంపల్లి జోన్ కార్యదర్శి శోభన్, నాయకులు మాణిక్యం, కృష్ణ, మల్లికార్జున్, సయ్యద్ ముజామిల్, అశోక్, సాయిలు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలు, ఆవిష్కరణలు అభివృద్ధిలో కీలకం

ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.తేజ్‌లోహిత్‌రెడ్డి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తేజ్‌లోహిత్‌రెడ్డి

రాయదుర్గం: పరిశోధనలు, ఆవిష్కరణలు అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ తేజ్‌లోహిత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్ క్యాంపస్‌లో శుక్రవారం ఫ్లిప్‌కార్ట్ సహకారంతో 'ఈ కామర్స్'పై ప్రత్యేక వర్క్‌షాప్‌ను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిశ్రమల సహకారంతో విద్యా నైపుణ్యాలను విద్యార్థులకు కలిగించేలా చేయాలనే తపనతో ఎఫ్‌డీడీఐ పనిచేస్తోందన్నారు. భారతదేశంలో డిజిటల్ వాణిజ్యం యొక్క ధోరణి, శిక్షణ, ప్రజాస్వామ్యీకరణ లక్ష్యంగా ఈ కామర్స్‌పై దృష్టి సారించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఫ్లిప్‌కార్ట్ పబ్లిక్ పాలసీ హెడ్ డాక్టర్ తఫీమ్‌సిద్దిఖీ మాట్లాడుతూ ప్రస్తుత రిటైల్ మార్కెట్‌లో ఇది 7.8 శాతం వాటాను కలిగి ఉందన్నారు. డిజిటల్ మార్కెట్‌లో విజయం సాధించాలని కోరుకునే విద్యార్థులకు ఆయన ఆచరణాత్మక మార్గదర్శకత్వాన్ని ఆయన అందించారు. చేతివృత్తుల వారు, స్థానిక వ్యవస్థాపకులకు మద్దతు ఇవ్వడానికి అంకితమైన కార్యక్రమం ఫ్లిప్‌కార్ట్ సమర్థ్ చొరవను విద్యార్థులకు పరిచయం చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్ ఫ్యాకల్టీ, అధికారులు, ఫ్లిప్‌కార్ట్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

టీఎల్‌ఎం మేళా ప్రారంభం



టీఎల్‌ఎం మేళాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన టీఎల్‌ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) మేళాను కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపుదల, అక్షరాస్యత, సంఖ్యా శాస్త్ర బోధన, అభ్యసన పద్ధతులను మెరుగుపరిచేందుకు దోహదపడుతుందన్నారు. హెచ్‌ఎం సుభాష్ చంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటయ్య, మండల ఎల్‌ఎఫ్‌ఎన్ నోడల్ ఆఫీసర్ రాములు, ప్రధానోపాధ్యాయులు బసవలింగం, ఉపాధ్యాయులు బల్వంత్‌రెడ్డి, శివరాజ్, పాండురంగారెడ్డి, నాయకులు పవన్‌కుమార్, బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

చందానగర్ : ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న ఇద్దరిని చందానగర్ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 14 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. చందానగర్ సీఐ సుంకరి విజయ్, డీఐ భాస్కర్‌లు కేసు వివరాలు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం బీరంగూడ మంజీరనగర్‌కు చెందిన తూర్పాటి సాయికుమార్ (21), మన్నె సాయి కిరణ్ (19)లు ఇళ్ల ముందు, ప్రధాన రోడ్ల పక్కన పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను రాత్రిపూట దొంగిలించే వారు. వీరిపై చందానగర్, మియాపూర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బి కాలనీ, గచ్చిబౌలి, సంగారెడ్డి టౌన్ పోలీస్‌స్టేషన్‌లలో బైకు దొంగతనాల కేసులతో పాటు ఆరంభ టౌన్‌షిప్‌లో ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డ కేసు ఉన్నాయన్నారు. కాగా ద్విచక్ర వాహనాలు వరుస దొంగతనాల కేసులు నమోదవుతున్న నేపథ్యంలో డిటెక్టివ్ పోలీసులు ఈ నెల 10వ తేదీ పాపిరెడ్డి కాలనీలో నిందితులు తూర్పాటి సాయికుమార్, మన్నె సాయి కిరణ్‌లను అదుపులోకి తీసుకున్నారు.

డిజైర్ డిజైనర్ ఎగ్జిబిషన్

గచ్చిబౌలి: గచ్చిబౌలిలోని సంధ్యా కన్వెన్షన్‌లో మూడు రోజులపాటు సాగే డిజైర్ డిజైనర్ ఎగ్జిబిషన్‌లో సెలబ్రిటీలు, మోడల్స్ శుక్రవారం సందడి చేశారు. లగ్జరీ, వెడ్డింగ్ స్పెషల్, ఫ్యాషన్ డిజైన్స్, టాప్ డిజైనర్లకు చెందిన డిజైన్లను ప్రదర్శించారు. .

రేషన్ బియ్యం పట్టివేత

గచ్చిబౌలి: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రాయదుర్గం పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఐకియా సమీపంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా డీసీఎం వాహనం పట్టుబడింది. సోదా చేయగా అందులో దాదాపు 110 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు తేలింది. సరిహద్దు రాష్ట్రాలకు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఎం.డి. మహ్మద్, డీసీఎం యజమాని అశోక్ రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగిస్తామన్నారు.